మనం
మెదక్ సంగారెడ్డి సిద్దిపేట
శుక్రవారం । 23 । అక్టోబర్। 2026 పేజీలు: 8




## పండుగ సాయన్న ధైర్యసాహసాలు అందరికీ స్ఫూర్తిదాయకం



2

## ప్రజా పోరాట యోధుల చరిత్రకు గుర్తింపు ఇవ్వడం అభినందనీయం



- కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్
- పండుగ సాయన్న జయంతిని అధికారికంగా నిర్వహించిన సీఎం రేవంత్రెడ్డికి కృతజ్ఞతలు
- సీఎంకు అమ్మవారి విగ్రహం బహూకరించిన నీలం

3



# అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో ఉండాలి

జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

గుర్తింపు పొందిన7 రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం

2

సంగారెడ్డి, అక్టోబర్ 22 మనం న్యూస్ ప్రతినిధి :- ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్-2026) ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తూ, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు.

# రైతులు దళారులను ఆశ్రయించొద్దు

- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సూచన



2

గీతం యూనివర్సిటీలో టీజీపీఎస్సీ పరీక్షా కేంద్రాన్ని సందర్శించి

## భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

2



# రైతులు దళారులను ఆశ్రయించొద్దు

**- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి**

**- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సూచన**



పటాన్ చెరు, అక్టోబర్ 22 (మనం న్యూస్) : రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ప్రతి ధాన్యపు గింజకు గిట్టుబాటు ధర లభించేలా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి రైతులకు విజ్ఞప్తి చేశారు. రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోకుండా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే తమ ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ముత్తంగి డివిజన్ పరిధిలోని పోచారం గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ముత్తంగి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వానా కాలం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో కల్పించిన సదుపాయాలను పరిశీలించి, ధాన్యం విక్రయించేందుకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. రైతులు పండించిన పంటను విక్రయించే సమయంలో ఇబ్బందులు ఎదుర్కోకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, సజావుగా సాగాలని, రైతులకు అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రానికి వచ్చే రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం ప్రకటించిన ధరల వివరాల ప్రకారం సన్న వడ్ల ఏ గ్రేడ్కు క్వింటాలుకు రూ.2,461 మద్దతు ధరతోపాటు రూ.500 బోనస్ కలిపి మొత్తం రూ.2,961 చెల్లించనున్నారు. రైతులు తమ పంటకు ప్రభుత్వం ప్రకటించిన ధరను పొందేలా కొనుగోలు కేంద్రాలు దోహదపడనున్నాయి. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ముత్తంగి చైర్మన్ బిక్షపతి, డైరెక్టర్లు, సీనియర్ నాయకులు అంతిరెడ్డి, శివారెడ్డి, నరేందర్ రెడ్డి, దుర్గారెడ్డి, రామచందర్, సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు.



## పండుగ సాయన్న ధైర్యసాహసాలు అందరికీ స్ఫూర్తిదాయకం

**సబ్ కలెక్టర్ ఉమా హారతి.**

సంగారెడ్డి, అక్టోబర్ 22 మనం న్యూస్ ప్రతినిధి :- అణగారిన, బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం పండుగ సాయన్న కనబరిచిన ధైర్యసాహసాలు, తెగువ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని నారాయణఖేడ్ సబ్ కలెక్టర్, ఇన్చార్జి డీఆర్డీఓ ఉమా హారతి అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం సంగారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో పండుగ సాయన్న జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సబ్ కలెక్టర్ ఉమా హారతి, పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆనాటి భూస్వాములు, దొరల అరాచకాలకు వ్యతిరేకంగా పండుగ సాయన్న వీరోచితంగా పోరాడారని కొనియాడారు. సామాజిక అసమానతలు, అన్యాయాలకు వ్యతిరేకంగా ప్రజల పక్షాన నిలిచి పోరాటం సాగించిన ఆయన ధైర్యసాహసాలు తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. పండుగ సాయన్న ఒక వర్గానికే పరిమితం కాకుండా అన్ని వర్గాల ప్రజలకు స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు. ఆయన ఆశయాలు, పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని నేటి యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు పులిమామిడి రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ, యువజన సంఘాల అధ్యక్షుడు కూన వేణు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



## అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు

**జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**గుర్తింపు పొందిన7 రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం**





సంగారెడ్డి, అక్టోబర్ 22 మనం న్యూస్ ప్రతినిధి :- ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్-2026) ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తూ, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు.

గురువారం కలెక్టరేట్లోని మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు సంగీత, పాండుతో కలిసి ఎస్ఐఆర్-2026 ప్రక్రియ పురోగతిపై గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఓటరు జాబితాకు సంబంధించి అందే ప్రతి క్లెయిమ్, అభ్యంతరాన్ని నిర్దేశిత ప్రామాణిక కార్యాచరణ విధానం (ఎస్ఓపీ) ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు పేర్కొన్నారు.నవంబర్ 5వ తేదీలోగా ప్రక్రియను పూర్తి చేసి, నవంబర్ 9న తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.

ఓటరు జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించి ఏవైనా సమస్యలు, అభ్యంతరాలు లేదా సూచనలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. ఈ సమావేశంలో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## గీతం యూనివర్సిటీలో టీజీపీఎస్సీ పరీక్షా కేంద్రాన్ని సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్.





సంగారెడ్డి అక్టోబర్ 22 మనం న్యూస్ ప్రతినిధి: తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలిలో అసిస్టెంట్ సైంటిస్ట్ అనలిస్ట్ గ్రేడ్-ఐఐ పోస్టుల భర్తీకి టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో ఈ నెల 24.న తేదీన నిర్వహించనున్న కంప్యూటర్ ఆధారిత రిక్రూట్మెంట్ టెస్ట్ ( సిబిఆర్టి) నేపథ్యంలో, రుద్రారంలోని గీతం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రం వద్ద చేపట్టనున్న పోలీసు బందోబస్తు, అభ్యర్థుల రాకపోకల మార్గాలు, పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు తీసుకుంటున్న భద్రతా చర్యలను సమీక్షించారు. పరీక్షా కేంద్రం పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.

పరీక్షా నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తూ, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పరీక్షలు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఈ పర్యటనలో జిల్లా ఎస్పీ వెంట అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఐపీఎస్, ఎస్బీ ఇన్స్పెక్టర్ సదా నాగరాజు, ఇస్నాపూర్ ఇన్స్పెక్టర్, భానూర్ ఇన్స్పెక్టర్ విజయ్ కృష్ణ, మహేష్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ రావ్, గీతం యూనివర్సిటీ యాజమాన్యం వర్మ, సతీష్ తదితరులు ఉన్నారు.

# ప్రజా పోరాట యోధుల చరిత్రకు గుర్తింపు ఇవ్వడం అభినందనీయం

**- కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్**
**- పండుగ సాయన్న జయంతిని అధికారికంగా నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు**
**- సీఎంకు అమ్మవారి విగ్రహం బహూకరించిన నీలం**






పటాన్ చెరు, అక్టోబర్ 22 (మనం న్యూస్) : తెలంగాణ ప్రజల కోసం పోరాడిన పండుగ సాయన్న జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం ఆయన చరిత్రకు దక్కిన గొప్ప గౌరవమని ప్రజా పోరాట యోధుల జీవితాలను గుర్తించి, వారి స్ఫూర్తిని భావితరాలకు అందించడంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ అభినందనీయమని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి పర్యవేక్షణలో అధికారికంగా నిర్వహించిన 174 వ పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరై పాల్గొని సాయన్న చిత్రపటానికి పూలు వేసి నివాళులు అర్పించడం పట్ల నీలం హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాబిన్‌హుడ్డ ప్రజల హృదయాల్లో నిలిచిన పండుగ సాయన్నకు అధికారికంగా గుర్తింపు కల్పించిన ముఖ్యమంత్రికి నీలం మధు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ముదిరాజ్ సంఘం నాయకులు, ముదిరాజులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రులను మర్యాదపూర్వకంగా కలిసిన కాట శ్రీనివాస్ గౌడ్

**- దామోదర రాజనర్సింహ, గడ్డం వివేక్ వెంకటస్వామికి దసరా శుభాకాంక్షలు**






పటాన్ చెరు, అక్టోబర్ 22 (మనం న్యూస్): విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని పటాన్చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ రాష్ట్ర మంత్రులను మర్యాదపూర్వకంగా కలుసుకొని దసరా శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమం, శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రి దామోదర రాజనర్సింహను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కాట శ్రీనివాస్ గౌడ్ కలిసి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు, భూగర్భ శాస్త్ర శాఖల మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని కాట శ్రీనివాస్ గౌడ్, మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ నీలం మధుతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. విజయదశమి పండుగను పురస్కరించుకొని మంత్రికి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. విజయదశమి సందర్భంగా మంత్రులను కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం ద్వారా పండుగ శుభాకాంక్షలను పరస్పరం పంచుకున్నారు. ఈ పర్వదినం ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, సిరిసంపదలు నింపాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని మంత్రులు ఆకాంక్షించారు. ఈ మర్యాదపూర్వక భేటీలు విజయదశమి పర్వదినం సందర్భంగా ఆత్మీయ వాతావరణంలో సాగాయి.

# బొల్లారం గాంధీ నగర్ కాలనిలో హెచ్ఎండిఎ స్థలాలలో అక్రమ నిర్మాణాలు

**అధికారుల పరిరక్షణ లోపం...రోజు ఒక్క దగ్గర అక్రమనకి గురైతున్న ప్రభుత్వ స్థలం నోటీసులు ఇచ్చారు... ఎఫ్ఐఆర్ నమోదు చేసారు... చర్యలు మాత్రం మర్చారు**



ఐడిఏ బొల్లారం, అక్టోబరు 22; మనం న్యూస్; హెచ్ఎండిఏ అధికారులు హెచ్ఎండిఏ ప్రభుత్వ స్థలాలు కాపాడే విషయంపై నిర్లక్ష్యం వహిస్తున్నారని బొల్లారం డివిజన్ లో గట్టిగ వినిపిస్తుంది. డివిజన్ పరిధిలోని బీసీ కాలనీ, గాంధీ నగర్ కాలనీలో కొన్ని నెలల క్రితం అక్రమంగా నిర్మాణం చేపట్టిన నిర్మాణాలను కూల్చివేత జరుపుతామని హెచ్ఎండిఏ అధికారులు హడావిడి చేసారు. డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్లో ప్రభుత్వ స్థలాల్లో చేపట్టిన ఆక్రమా నిర్మాణాలపై సంబంధిత అధికారులు ఎఫ్ఐఆర్ నమోదు చేయించి నోటీసులు జారిచేసారు.నోటీసులు జారిచేసి సుమారు 15 నెలలు కావొస్తున్న ఎటువంటి చర్యలు తీసుకోకపోగ అటువైపు అధికారులు మరలా కన్నెత్తి కూడా చూడలేదు. అదే అలుసుగా చూసుకున్న ఇంకొందరు ఆక్రమణదారులు గత కొన్ని రోజులుగా డివిజన్ పరిధిలోని గాంధీ నగర్ కాలనీ, బీసీ కాలనీలలో నూతనంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ అక్రమ నిర్మాణాలపై స్థానికంగా చర్చనీయంశంగా మారింది. ఈ విషయంపై పలువురు స్థానిక నాయకులు పలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రస్తుతం చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోని ప్రభుత్వ స్థలాన్ని కాపాడాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు. హెచ్ఎండిఏ అధికారులు ఇప్పుడైనా చర్యలు తీసుకుంటారో... లేదా ఇంతకీ ముందులా వదిలేస్తారో??? అనే విషయంపై వేచి చూడాలి.

# హత్యాయత్నం కేసులో నిందితుడికి 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్

మద్దూర్ 22 మనం న్యూస్ :- సిద్దిపేట జిల్లా మద్దూర్ మండల కేంద్రంలో దసరా పండుగ రోజు రాత్రి జరిగిన గొడవలో కత్తితో దాడికి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి జ్యుడిషియల్ రిమాండ్కు తరలించారు.

వివరాల్లోకి వెళితే.. దసరా రోజు రాత్రి 11 గంటల సమయంలో నాయిని మధు తన తండ్రి శంకరయ్యను కొడుతుండగా, నాయిని రాకేష్ అడ్డుకునేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో నాయిని మధు రాకేష్పై కత్తితో దాడి చేయడానికి ప్రయత్నించగా, ఉమేష్ అడ్డుకునే క్రమంలో అతని చేతికి గాయమైంది.



ఈ ఘటనపై ఉమేష్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో నాయిని మధును పోలీసులు ఈరోజు అరెస్ట్ చేసి, జ్యుడిషియల్ రిమాండ్ నిమిత్తం చేర్యాల కోర్టులో హాజరుపరిచారు.

విచారణ అనంతరం గౌరవ న్యాయస్థానం నిందితుడికి 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించడంతో, అతడిని సిద్దిపేట జిల్లా జైలుకు తరలించారు.



# మృతురాలి కుటుంబానికి హరీశ్‌రావు ఆర్థిక సాయం

**గట్లమల్యాలలో బాధిత కుటుంబానికి రూ.5 వేల అందజేత**

నంగునూరు అక్టోబర్ 22 మనం న్యూస్:- సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం గట్లమల్యాలలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన చామంతుల ఎల్లవ్వ కుటుంబానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు ఆర్థిక సాయం అందించారు. ఎల్లవ్వ మృతి విషయాన్ని గ్రామ పెద్దలు హరీశ్ రావు దృష్టికి తీసుకువెళ్ళారు. స్పందించిన హరీశ్ రావు తక్షణ సాయంగా రూ.5 వేలు పంపించారు. హరీశ్ రావు ఆదేశాల మేరకు బీఆర్ఎస్ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. మృతిరాలు భర్త చామంతుల కిష్టయ్య, కుమారుడు బాలకిషన్ లకు

ప్రగాఢ సానుభూతి తెలియజేసి, వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇంగే నరేష్, ఉప సర్పంచ్ తిప్పని శ్రీనివాస్, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు రేణుక వేణుగోపాల్, గ్రామ శాఖ అధ్యక్షుడు ఎర్రబాబు, వార్డు సభ్యులు లోకటి సత్తయ్య, నోముల రవీందర్, బీఆర్ఎస్ నాయకులు పుట్ట వెంకన్న, చామంతుల అశోక్, రంగు కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# టీఎన్జీవోస్ నూతన కమిటీ ఎన్నిక

**జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి ఎండి జావిద్ అలీ నియామకం.**
**ఉద్యోగుల సంక్షేమం హక్కుల పరిష్కారమే ధ్యేయం.**
**ప్రభుత్వ ఉద్యోగులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు.**
**ఎన్జీవోస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు.ఎండి జావిద్ అలీ.**





సంగారెడ్డి అక్టోబర్ 22 మనం న్యూస్ ప్రతిని ధి : సంగారెడ్డి జిల్లా టీఎన్జీవో నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల సంఘ అధికారిగా వ్యవహరించిన సెంట్రల్ యూనియన్ మహిళా అధ్యక్షురాలు నిర్మల రాజకుమారి ఆధ్వర్యంలో ఈ ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆమె ప్రకటించారు. సంగారెడ్డి టి ఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడిగా ఎండి జావిదల్లి ప్రధాన కార్యదర్శిగా వేల్పూర్ రవి, అసోసియేట్ అధ్యక్షులుగా వెంకటరెడ్డి, కోశాధికారిగా కసిని శ్రీకాంత్ లీగల్ అడ్వైజర్ గా భాస్కర్ లను ఎన్నుకున్నారు ఈ సందర్భంగా టి ₹ఎన్జీవోస్ జిల్లా నూతన అధ్యక్షుడు ఎండి జాబితా ని మాట్లాడుతూ₹ . ప్రభుత్వ ఉద్యోగులు తనపై ఉంచి. నమ్మకం ఉంచి రెండోసారి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్న ప్రతి ఒక్కరికి పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు.ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఉద్యోగులకు సంబంధించి పెండింగ్ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఉద్యోగుల ఐక్యత మరింత బలోపేతం చేస్తూ సంఘాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లామని అన్నారు.

జిల్లా ప్రధాన కార్యదర్శి వేల్పూర్ రవి మాట్లాడుతూ₹. జిల్లాలోని వివిధ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల గురించి వాటి పరిష్కారానికి సంఘం తరఫున నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఉద్యోగుల సంక్షేమం కోసం నాయకులు సభ్యుల సమన్వయంతో పనిచేస్తానని అన్నారు నూతన కార్యవర్గం ఉద్యోగుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వారి




హక్కుల సంక్షేమ సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పనిచేయాలని కోరారు. ఏకగ్రీవంగా ఎన్నిక ద్వారా సంఘం నాయకత్వంపై ఉద్యోగులు ఉంచిన విశ్వాసం స్పష్టమైందని పేర్కొన్నారు సంగారెడ్డి టి ఎన్జీవోస్ సంఘాన్ని మరింత బలోపేతం చేస్తూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం లో ముందుండాలని నూతన కార్యవర్గ సభ్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో బలరాం, జగన్ పట్టణ అధ్యక్షులు ప్రమోద్ కుమార్ ,యాదవ్ రెడ్డి ,వెంకట్ రెడ్డి దత్తు ,నర్సిం లు ,దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

---



## ఘనంగా సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలు

వర్గల్ అక్టోబర్22మనం న్యూస్: మండల కేంద్రంలో కీర్తిశేషులు పండుగ సాయన్న ముదిరాజ్ 174వ జయంతిని వేడుకలు ఘనంగా నిర్వహించారు,పండుగ సాయన్న జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలో ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షులు శ్రీరామ్ నర్సింలు ముదిరాజ్, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరవ తలారి బిక్షపతి ముదిరాజుతో కలిసి పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజా వీరుడు పండుగ సాయన్న పెత్తందారి వ్యవస్థపై తిరుగుబాటుచేసి పేదల గుండెల్లో మహాత్ముడు అయ్యాడన్నారు.

రజాకారులు,పెత్తందారుల పై తిరుగుబాటు చేసి వారి గుండెల్లో రైళ్ల పరిగెత్తించి వారి కుట్రలకు బలైయి అమరవీరుడయ్యాడు,

ఈ ప్రజావీరుడు పండుగ సాయన్న జయంతినిప్రభుత్వం అధికారికంగా నిర్వహించడము గొప్ప శుభ పరిణామమని, ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వానికి మండల కమిటీ ధన్యవాదాలు తెలిపారు. అలాగే ముదిరాజులను బి,సి,సి డి గ్రూపు నుండి ఏ గ్రూపులోనికి చేర్చాలని వారు డిమాండ్ చేశారు,

ఈ కార్యక్రమంలో వర్గల్ సర్పంచ్ దేవగనిత విజయభారతి మాజీ ఉపసర్పంచ్ పసుల రమేష్ ,మజీద్ పల్లి సర్పంచ్ లింగ చెన్నయ్య ముదిరాజ్, తునికి మక్త సర్పంచ్ పసుల స్వామి ముదిరాజ్, చౌదర్పల్లి సర్పంచ్ లింగ రమేష్,సోప్పరి యాదగిరి ముదిరాజ్,శ్రీరామ్ శ్రీకాంత్ ముదిరాజ్, లింగోఖర్ ముదిరాజ్ మండల పరిధిలోని వివిధ గ్రామాల ముదిరాజ్ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు,కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.




## శోభాయాత్ర సమయంలో పోగొట్టుకున్న బంగారు చైన్ బాధితుడికి అప్పగించిన పోలీసులు

ఐడిఏ బొల్లారం,అక్టోబరు,22;మనం న్యూస్: దుర్గామాత నిమజ్జన శోభాయాత్రలో పోగొట్టుకున్న తులం బంగారు గొలుసును పోలీసులు బాధితునికి అప్పగించారు. బొల్లారం డివిజన్ పరిధిలోని వైయస్సార్ కాలనీలో ఈ నెల 20వ తేదీన అమ్మవారి నిమజ్జన శోభాయాత్ర జరుగుతుండగా యువకులు రంగులు చల్లుకునే క్రమంలో ఓ యువకుడి బంగారు గొలుసు పోగొట్టుకున్నాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మరుసటి రోజు పోలీసులు స్థానికంగా సీసీ కెమెరాల పుటేజీని విచారించగా ఓ బాలుడికి బంగారు గొలుసు దొరికినట్లుగా నిర్ధారించుకున్నారు. ఈ మేరకు గురువారం పోలీస్ స్టేషన్లోఎస్ ఎచ్ ఓ సుధీర్ కుమార్ సేకరించిన బంగారు గొలుసును బాధితుడికి అప్పగించారు. దీంతో బాధితుడు పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.

## మాజీ మంత్రి హరీష్ రావుకు దసరా శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే జీఎంఆర్

పటాన్ చెరు, అక్టోబర్ 22 (మనం న్యూస్) : విజయానికి ప్రతీకగా, ధర్మానికి ప్రతిరూపంగా నిలిచే విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి గురువారం హైదరాబాద్లోని మాజీ మంత్రి, సిద్దిపేట శాసన సభ్యులు తన్నీరు హరీష్ రావును మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్లోని శ్రీ హరీష్ రావు నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే జీఎంఆర్.. నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి ఆయనకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, విజయాలు నింపాలని ఆకాంక్షించారు. ప్రజలంతా సుఖశాంతులతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని, తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.



---

## సుల్తాన్ పూర్ ఎం.ఎస్ ఫంక్షన్‌హాల్‌లో అలయ్ బలయ్ కార్యక్రమం

**మంత్రి దామోదర్ ఆధ్వర్యంలో వేడుకలు - జిల్లా గ్రంథాలయ చైర్మన్ గొల్ల అంజయ్య**

రాయికోడ్,అక్టోబర్ 22(మనం న్యూస్):దసరా పండుగ సందర్భంగా ఆందోల్ నియోజకవర్గ ప్రజలతో ఆత్మీయంగా కలుసుకునేందుకు, సోదరభావం, ఐక్యత, సంప్రదాయాలను చాటిచెప్పేందుకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి



దామోదర్ రాజనరసింహ ఆధ్వర్యంలో 'అలయ్ బలయ్' కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గొల్ల అంజయ్య వెల్లడించారు.

ఈ కార్యక్రమం అక్టోబర్ 23వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటల నుండి సుల్తాన్ పూర్ లోని ఎం.ఎస్ ఫంక్షన్ హాల్, తాడ్ దాన్ పల్లి ఎక్స్ రోడ్ వద్ద జరగనుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆందోల్ నియోజకవర్గ ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# అల్లం పండించే పొలాల్లో కొత్తగా వచ్చిన అగ్గి తెగులును పోలిన తెగులుపై కేంద్ర బృందం సంయుక్త పర్యటన





జహీరాబాద్ అక్టోబరు 22 మనం న్యూస్: కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం (సిఐపిఎంసి), హైదరాబాద్ నుండి వచ్చిన అధికారులు వెంకటరెడ్డి, ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్,బసవన్నప్ప ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్,ఉదయశంకర్ అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ల బృందం, ఫల పరిశోధన స్థానం సంగారెడ్డి నుండి వచ్చిన శాస్త్రవేత్త డాక్టరు మౌనిక, డిడిఎస్-కేవికే నుండి వచ్చిన శాస్త్రవేత్త శైలజ, స్థానిక ఉద్యాన శాఖ అధికారి సునీత రోస్,హెచ్ఈఓ సతీష్ అందరూ అధికారులు ఒక సంయుక్త పర్యటన పర్యవేక్షణలో భాగంగా అల్లం సాగు చేసిన పొలాల్లో కొత్తగా వచ్చిన అగ్గి తెగులును పోలిన తెగులును పరిశీలించారు.

ఈ తెగులు కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో కొత్తగా వ్యాపించి ఉందని, మన రాష్ట్రంలో ఇప్పుడు కనిపిస్తుందని చెప్పారు. ఈ తెగులు కలుగజేసే శిలీంద్రం ప్రొక్సిపైరిక్యులేరియా జిన్జబెరిస్ గా ఇండియన్ ఇన్స్టిట్యూట్స్ ఆఫ్ స్పయిస్ రీసెర్చ్ కేరళా వాళ్ళు నిర్ధారించారు.

**నివారణ చర్యలకు చిట్కా..**

ప్రాపికోనజోల్ లేదా టెబుకోనజోల్ అనే మందును లీటరు నీటికి ఒక మిల్లీ లీటరుగా వేసి పై పాటుగా పిచికారి చెయ్యాలి, విత్తన శుద్ధి కూడా ఇవే మందులతో చేసుకోవాలని తెలిపారు. అదేవిధంగా తెగులు సోకిన ప్రాంతాలనుండి ఎట్టిపరిస్థితుల్లోనూ విత్తనానికి వాడే కొమ్ములను తెచ్చుకోకూడదు అని చెప్పారు.





# నర్మేటలో ఘనంగా శ్రీ దుర్గాదేవి నిమజ్జనం

**వేలంపాటలో కలశాన్ని 17100 కు దక్కించుకున్న ఉప సర్పంచ్ కూచన్ విక్రమ్**

నంగునూరు, అక్టోబర్ 22 మనం న్యూస్ :- సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మేట గ్రామంలో దేవి నవరాత్రుల ముగింపు వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. బజరంగ్ యూత్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి శ్రీ దుర్గాదేవి నవరాత్రుల ముగింపు సందర్భంగా అమ్మవారి శోభాయాత్రను గ్రామ వీధుల్లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా నిర్వహించిన వేలంపాటలో నర్మేట గ్రామ ఉప సర్పంచ్ కూచన్ విక్రమ్ అమ్మవారి కలశాన్ని భారీ ధరకు పాడి 17100 కు సొంతం చేసుకున్నారు.

**భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర**

నవరాత్రుల చివరి రోజు కావడంతో నర్మేట గ్రామ వీధులన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. బజరంగ్ యూత్ సభ్యులు అమ్మవారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి, కోలాటాలు, భజనల నడుమ శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ఘనంగా వీడ్కోలు పలికారు.

**పోటీల నడుమ వేలంపాట**

శోభాయాత్ర సందర్భంగా బజరంగ్ యూత్ సభ్యులు నిర్వహించిన వేలంపాట భక్తుల నడుమ ఎంతో ఉత్సాహంగా సాగింది. అమ్మవారి కృప కోసం పోటీపడిన భక్తులలో, గ్రామ ఉప సర్పంచ్ కూచన్ విక్రమ్ అత్యధిక ధర 17100 పలికి వేలంపాటలో కలశాన్ని దక్కించుకున్నారు. ఈ సందర్భంగా కూచన్ విక్రమ్ మాట్లాడుతూ.. అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో విలసిల్లాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో బజరంగ్ యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు మరియు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.





# మాజీ మంత్రి హరీశ్ రావుకు దసరా శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్



సంగారెడ్డి అక్టోబర్ 22 మనం న్యూస్ ప్రతినిది : హైదరాబాద్లో మాజీ మంత్రివర్యులు, బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు కు దసరా సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు జమ్మి ఆకులు అందించి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆప్యాయంగా పలకరించుకుని, ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు పరస్పరం తెలియజేసుకున్నారు దసరా పండుగ ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, సౌభాగ్యాలను తీసుకురావాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో సంగారెడ్డి నియోజకవర్గ నాయకులు , ప్రజా ప్రతినిధులు, కౌన్సిలర్ లు కార్యకర్తలు ఉన్నారు.



# గజ్వేల్ అభివృద్ధి పనులకు నిధులు ఇవ్వండి

**పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయండి**

**నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయండి**

**మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామిలను కలిసిన కాంగ్రెస్ నేతలు**



గజ్వేల్ అక్టోబర్ 22 మనం న్యూస్: గజ్వేల్ అభివృద్ధి పనులకు నిధులు ఇవ్వాలని, పెండింగ్ పనులు పూర్తి చేయాలని, ఖాళీగా ఉన్న నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ గురువారం గజ్వేల్ కాంగ్రెస్ నేతలు మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో రాష్ట మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామిలను కలసి విజ్ఞప్తి చేశారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో గజ్వేల్ కు ప్రాధాన్యత ఇవ్వాలని, గత మూడేళ్లుగా అసంపూర్తి దశలో నిలిచిన రింగు రోడ్డు, రోడ్ల విస్తరణ, ప్రభుత్వ కార్యాలయాల మరమ్మత్తులు, నూతన భవనాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే వివిధ నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయడంతో పాటు రాష్ట్రస్థాయి పోస్టుల్లో గజ్వేల్ నేతలకు అవకాశం ఇవ్వాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రులు సానుకూలంగా స్పందించినట్లు గజ్వేల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి నాయకులు నాయిని యాదగిరి, వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ మోహన్, వైస్ చైర్మన్ ప్రభాకర్ గుప్త, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, లీగల్ సెల్ నేత సాజిద్ బేగ్, సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు అశోక్ రెడ్డి కీసర వెంకటేష్, జిల్లా మైనార్టీ సెల్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు సమీర్, ఆయా మండలాల కాంగ్రెస్ బాధ్యులు, నేతలు రవీందర్ రెడ్డి, అశోక్, సుఖేందర్ రెడ్డి, గాడిపల్లి శ్రీనివాస్, సుకేందర్ రెడ్డి, కృష్ణారెడ్డి, కొండల్ రెడ్డి, కర్ణాకర్, గుంటుకు శ్రీను, నక్క రాములు గౌడ్, ఉపేందర్ రెడ్డి, రమేష్, జహీర్ భాయి తదితరులు పాల్గొన్నారు.

# వావిలాల అడవిలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ఐడిఎ బొల్లారం, అక్టోబరు 22: మనం న్యూస్; గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని వావిలాల గ్రామ శివారు ప్రాంతం లో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. సమాచారం అందుకున్న జిన్నారం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతురాలి వయస్సు సుమారు 30 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని, ఆమె వివాహితగా పోలీసులు గుర్తించారు. మహిళ హత్యకు గురై ఉండవచ్చన్న అనుమానంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పటాన్చెరువు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురికి తరలించారు. మృతురాలిని ఎవరైనా గుర్తించినట్లయితే జిన్నారం పోలీసులను 8712656750 సంప్రదించాలని కోరారు.

# ముదిరాజుల హక్కులకై కలిసి పోరాడుదాం

**పండుగ సాయన్న జయంతి సభలో నీలం మధు పిలుపు**

హత్నూర (మనం న్యూస్) అక్టోబర్ 22: తరతరాలుగా సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాల్లో వెనుకబడుతున్న ముదిరాజ్ కులస్తులు రాజకీయ పార్టీలకతీతంగా ఐక్యంగా పోరాడితేనే హక్కులు సాధించగలమని కాంగ్రెస్ పార్టీ మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి ఇన్చార్జి, ముదిరాజు ముద్దుబిడ్డ నీలం మధు ముదిరాజ్ పిలుపునిచ్చారు. తెలంగాణ స్వాతంత్ర్య పోరాట యోధుడు దివంగత పండుగ సాయన్న 174వ జయంతి సందర్భంగా గురువారం నాడు మండలంలోని దౌల్తాబాద్ లో ముదిరాజులు బారీ ప్రదర్శన నిర్వహించిన తర్వాత స్థానిక ఎస్ ఎస్ ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆంగ్లేయుల తీవ్ర నిర్బంధాన్ని సైతం



లెక్కచేయకుండా ముదిరాజు కులస్తులపై జరిగిన వివక్ష, ఆర్థిక దోపిడీని సమూలంగా అంతం చేయాలని ఆనాడు ముదిరాజు ఆరాధ్య దైవం పండుగ సాయన్న వీరోచిత పోరాటం చేసిన ధీశాలి అని ఆయన కొనియాడారు. సామాజిక,ఆర్థిక, రాజకీయ రంగాల్లో స్వాతంత్ర్యానంతరం కూడా ముదిరాలు వెనుకబడే ఉండటం విచారకరం అని



ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనంతటికి ముదిరాజులందరూ ఐక్యంగా లేకపోవడమే కారణమన్నారు. ఇకనైనా పార్టీలకతీతంగా ఏకం కావాల్సిన అవసరం ఉందని అన్నారు.ముదిరాజులను త్వరలో బి సి (డి) నుంచి బి సి (ఏ) లోకి మార్చే యోచనలో ప్రభుత్వమున్న సంగతిని సభ ముందించారు. యాభై ఏళ్ల బి సి ఇతర కులాల వృత్తిదారులకు నెలకు ఇస్తామన్న పెన్షన్ స్కీమ్ ను మత్స్యకార్మికులైన ముదిరాజులకు కూడా వర్తింప చేసేలా ప్రభుత్వ నేతల దృష్టికి తీసుకువెళుతానన్నారు.అంతకుముందు ముదిరాజు కులసంఘం జిల్లా నాయకులు గున్నల నర్సింలు,మండల అధ్యక్షులు రాజేందర్,ఉపాధ్యక్షులు అర్జున్,ప్రధాన కార్యదర్శి దూడి పోచయ్య, కమిటీ సభ్యులు దానంపల్లి సుజాత, సతీష్ తదితరులు ప్రసంగించి పండుగ సాయన్న వీరోచిత పోరాటాలను స్మరించారు. ఈ సమావేశంలో యాదగిరి సభకు అధ్యక్షత వహించగా మండలం లోని ఆయా గ్రామాల ముదిరాజ్ కులసంఘం నాయకులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

# చౌటకూర్లో ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు

**సాంప్రదాయబద్ధంగా నిర్వహించిన ముదిరాజులు.. ఘనంగా నివాళులు**

చౌటకూర్, అక్టోబర్ 22 (మనం న్యూస్) చౌటకూర్ మండల కేంద్రంలో గుదువారం పండుగ సాయన్న జయంతి వేడుకలను ముదిరాజు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సూరేపల్లి అనుదీప్ ఆధ్వర్యంలో



పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా పండుగ సాయన్న సేవలను, ఆయన చేసిన సామాజిక కార్యక్రమాలను పలువురు స్మరించుకున్నారు. అనంతరం ముదిరాజు యువకులు, సంఘం నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. 'జై ముదిరాజ్' నినాదాలతో ర్యాలీ ఉత్సాహంగా సాగింది. పండుగ సాయన్న ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.జయంతి వేడుకల్లో ముదిరాజు సంఘం నాయకులు నర్సింలు గోవర్ధన్ జనార్ధన్ యువకులు, గ్రామ పెద్దలు, పాల్గొని పండుగ సాయన్నకు ఘనంగా నివాళులర్పించారు.



# సుల్తాన్పూర్లో ఘనంగా అంబేద్కర్ యూత్ వాలీబాల్ టోర్నమెంట్

చౌటకూర్ అక్టోబర్ 22 (మనం న్యూస్) చౌటకూర్ మండలం సుల్తాన్పూర్ గ్రామంలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్ను ఘనంగా నిర్వహించారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలకు ప్రోత్సాహం కల్పించాలనే ఉద్దేశంతో ఈ టోర్నమెంట్ను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ చంటి గీతారాణి రమేష్, ఉపసర్పంచ్ మహేష్ యాదవ్ క్రీడాకారులను అభినందించారు. గ్రామీణ యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో వార్డు సభ్యులు చెన్నం రెడ్డి, నేత ప్రభాకర్, అబ్బి తలారి ప్రసాద్, నేత మేషోక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, అంబేద్కర్ యూత్ అధ్యక్షులు గంట బిన్ను, ఉపాధ్యక్షులు చింటూ, క్రీడా అధ్యక్షులు పవన్, ప్రీతం, బబ్లు, అంబేద్కర్ యూత్ సభ్యులు చంటి, రఘు, తదితరులు పాల్గొన్నారు.

# టీ.జీ.పి.ఎస్.సీ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.**



సంగారెడ్డి, అక్టోబర్ 22 మనం న్యూస్ ప్రతినిధి :- తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీ.జీ.పి.ఎస్.సీ) ఆధ్వర్యంలో ఈ నెల 24న జిల్లాలో నిర్వహించనున్న అసిస్టెంట్ సైంటిస్ట్ (అనలిస్ట్ గ్రేడ్ ఐఐ), కంప్యూటర్ ఆధారిత పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

జిల్లాలో ఈనెల 24న జరిగే అసిస్టెంట్ సైంటిస్ట్ (అనలిస్ట్ గ్రేడ్ - ఐ ఐ), పరీక్షకు సంబంధించి గురువారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో ఎస్పీ పరతోష్ పంకజ్ తో కలిసి కలెక్టర్ సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రుద్రారం గ్రామంలోని గీతం యూనివర్సిటీలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు, మొత్తం 150 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్ష రెండు సెషన్లలో ఉంటుందని, మొదటి సెషన్ ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. మొదటి సెషన్కు ఉదయం 8.30 గంటల నుంచి కేంద్రంలోకి అనుమతిస్తారని, ఉదయం 9.30 గంటలకు గేట్లు మూసివేస్తారని తెలిపారు. రెండో సెషన్కు మధ్యాహ్నం 1 గంట నుంచి అనుమతిస్తారని, మధ్యాహ్నం 2.00 గంటలకు గేట్లు మూసివేస్తారని స్పష్టం చేశారు. గేట్లు మూసివేసిన తర్వాత ఆలస్యంగా వచ్చే అభ్యర్థులకు అనుమతి ఉండదని తెలిపారు.

పరీక్షా కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు, బ్లూటూత్ పరికరాలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరాదని, అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. చీఫ్ సూపరింటెండెంట్ మినహా ఇతర సిబ్బంది ఎవరూ సెల్ఫోన్లు తీసుకెళ్లరాదని స్పష్టం చేశారు.

పరీక్షల సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని ట్రాన్స్కో ఎస్ఈని, అభ్యర్థులకు పరీక్ష సమయానికి అవసరమైన రవాణా సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలనీ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రంలో వైద్య బృందాన్ని అందుబాటులో ఉంచాలని, కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. దివ్యాంగ అభ్యర్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్ష రాసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని డిడబ్ల్యూఓ కు సూచించారు.



అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పరీక్షలను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

పరీక్షల నిర్వహణ సాఫీగా ప్రశాంతంగా జరగడానికి తీసుకుంటున్న భద్రతా ఏర్పాట్ల గురించి ఎస్పి పరతోష్ పంకజ్ వివరించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు, ట్రాన్స్కో ఎస్ఈ, ఆర్టీసీ, వైద్య ఆరోగ్య, మహిళ శిశు వికలాంగుల శాఖ అధికారులు, ఇస్నాపూర్ మున్సిపల్ కమిషనర్, పటాన్చెరు తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపనకు భూమి పూజ

**అంబేద్కర్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలి**

**దళిత, గిరిజన సంఘాల నాయకులు**

**తొలి గిరిజన తాండలో విగ్రహ ఏర్పాటుపై హర్షం**





జహీరాబాద్ అక్టోబరు 22 మనం న్యూస్: కోహిర్ మండలంలోని పిచరాగడి పాత తాండ గ్రామ పంచాయతీ ఆవరణలో నూతనంగా డాక్టరు బి.ఆర్.అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపనకు శ్రీకారం చుట్టారు. కాంగ్రెస్ పార్టీ కోహిర్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు, స్థానిక సర్పంచి ప్రతినిధి రాథోడ్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో గురువారంనాడు విగ్రహ ప్రతిష్టాపన కోసం భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి వివిధ గ్రామాల నుంచి దళిత, గిరిజన అంబేద్కర్ సంఘాల నాయకులు భారీ సంఖ్యలో హాజరై, నిర్ణీత స్థలంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా దళిత, గిరిజన సంఘాల నాయకులు మాట్లాడుతూ మహనీయుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలు, అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని పిలుపునిచ్చారు. జహీరాబాద్ నియోజకవర్గంలోనే మొట్టమొదటి గిరిజన గూడెం అయిన పిచరాగడి తాండలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమైన విషయమని వారు హర్షం వ్యక్తం చేశారు.

గ్రామాభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న రాథోడ్ వినోద్ కుమార్, చొరవను కొనియాడుతూ ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మొదటి గిరిజన తాండలో మహనీయుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించాలనే ఆలోచన రావడం అభినందనీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో తాండ మాజీ సర్పంచ్ చౌహన్ చందర్,గ్రామ వార్డు సభ్యులు రామావత్ నర్సింలు, రాథోడ్ సంజీవ్ కుమార్,సజ్జపూర్ ఉప సర్పంచి మైసయ్య,నాయకులు లోకనాథం, భ్యగారి అశోక్,టీ.సంజీవులు,ప్రకాష్, సచిన్,పలువురు దళిత,గిరిజన సంఘాల నాయకులు,స్థానిక ప్రజలు మరియు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## హరీశ్నను మర్యాద పూర్వకంగా కలిసిన ఉద్యమ నేత నామ రవికిరణ్ గుప్తా



జహీరాబాద్ అక్టోబరు 22 మనం న్యూస్: సిద్ధిపేట ఎమ్మెల్యే, రాష్ట్ర మాజీ మంత్రి, రాష్ట్ర అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడరు, తన్నీరు హరీష్ రావును జహీరాబాద్ ప్రాంత బిఆర్ఎస్ పార్టీ నాయకులు, ఉద్యమ నేత నామ రవికిరణ్ గుప్తా మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రవికిరణ్ హరీష్ రావుతో జహీరాబాద్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ విషయమై ప్రధానంగా చర్చించినట్లు, దసరా పర్వదిన శుభాకాంక్షలు తెలియజేసినట్లు సమాచారం.



## బాబా పిలుపుతో పుస్తకావిష్కరణ

సంగారెడ్డి :- జర్నలిస్టు కల్వల మల్లికార్జున్ రెడ్డి రచించిన బాబా పిలుపుతో పుస్తకం ఆవిష్కరణ గురువారం సంగారెడ్డి బైపాస్ రోడ్డు ప్రశాంత్ నగర్ లోని సాయిబాబా ఆలయంలో జరిగింది. 2023లో మల్లికార్జున్ రెడ్డి దంపతులు సంగారెడ్డి షిరిడి సాయిబాబా ఆలయం నుంచి షిరిడి సాయిబాబా ఆలయం వరకు 16 రోజులపాటు చేసిన పాదయాత్ర అనుభవాలను ఈ పుస్తకంలో పంచుకున్నారు. గురువారం ఆలయంలో నిర్వహించిన మహా సంప్రోక్షణ కార్యక్రమాల సందర్భంగా ఆయన రచించిన పుస్తకాన్ని భక్తుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మల్లికార్జున్ రెడ్డి, ఆయన సతీమణి లతాశ్రీ ని సన్మానించి ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ రెడ్డి దంపతులు తమ షిరిడీ పాదయాత్రలో ఎదురైన అనుభవాలను, బాబా లీలలను భక్తులతో పంచుకున్నారు. బాబా అనుగ్రహంతోనే పుస్తకాన్ని భక్తులకు అందించగలిగానని పేర్కొన్నారు. ఆలయ పూజారి బసవరాజు, ఆలయ నిర్వాహకులు సూర్యాపేట వీరేందర్, బాసుపల్లి ప్రభాకర్రెడ్డి, కాశప్ప, నరసయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బాబా పిలుపుతో పుస్తకాన్ని భక్తులకు అందజేశారు.

## మాజీ మంత్రి ఏసీఆర్ నిర్వహించిన దసరా అలయ్‌బలయ్ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

జహీరాబాద్ అక్టోబరు 21 మనం న్యూస్:జహీరాబాద్ పట్టణంలోని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ, రాష్ట్ర మాజీ మంత్రి డాక్టరు ఏ చంద్రశేఖర్ క్యాంపు కార్యాలయంలో దసరా పండుగను పురస్కరించుకొని నిర్వహించిన దసరా ఆత్మీయ సమ్మేళనం (అలయ్,బలయ్) సందర్భంగా జహీరాబాద్ నియోజకవర్గం ప్రజాప్రతినిధులు, ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆప్యాయంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రజలతో డాక్టరు ఏ చంద్రశేఖర్ ఆత్మీయంగా ముచ్చటిస్తూ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలతో మమేకమవుతూ, వారి ఆప్యాయతను స్వీకరిస్తూ, పరస్పర స్నేహసంబంధాలను మరింత బలోపేతం చేసుకున్నారు.తమ క్యాంపు కార్యాలయానికి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు,సామాన్య కార్యకర్తలకు, కులు సంఘాల నాయకులను, పాత్రికేయ మిత్రులకు భోజన వసతి కల్పించారు.







## అమీన్‌పూర్‌లో ఘనంగా దుర్గామాత నిమజ్జన కార్యక్రమం

**- పాల్గొన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

అమీన్ పూర్, అక్టోబర్ 22 (మనం న్యూస్) : అమీన్ పూర్ డివిజన్ కేంద్రంలో దసరా శరన్నవరాత్రుల సందర్భంగా మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ దుర్గామాత శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ..దసరా పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని, దుర్గామాత ఆరాధన శక్తి, ధైర్యం, ధర్మానికి నిదర్శనమని పేర్కొన్నారు. శరన్నవరాత్రులు ప్రజల్లో భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడంతో పాటు సమాజంలో ఐక్యత, సోదరభావాన్ని బలోపేతం చేస్తాయని అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు పండుగలు ప్రతిబింబాలని, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల మధ్య పరస్పర ప్రేమాభిమానాలను పెంపొందిస్తాయని తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ పటాన్ చెరు నియోజకవర్గ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి, మాజీ జెడ్పీటీసిలు సుధాకర్ రెడ్డి, బాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, భక్తులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



## భవాని మాత నామస్మరణతో తుల్జాపూర్‌కు పాదయాత్రగా బయలుదేరిన భక్తులు





రాయికోడ్, అక్టోబర్ 22(మనం న్యూస్): సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల పరిధిలోని ఇటుకపల్లి గ్రామం నుండి మహారాష్ట్రలోని తుల్జాపూర్ భవాని మాత దేవస్థానానికి పాదయాత్ర బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు ప్రారంభమైంది.

గ్రామంలోని దేవాలయం నుండి మంచి ముహూర్తంలో ఈ పాదయాత్రను ప్రారంభించారు. ఈ పాదయాత్ర ఎర్రోళ్ల నరేష్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతోంది.

ఈ పాదయాత్రలో కమ్మరి శివకుమార్, తట్టుపల్లి వీరారెడ్డి, ఆకుల పాండు, రాయిపల్లి పాండు, బుద్దా సందీప్, సిద్ధారెడ్డి, జామలపురం తుకారాం, జామలపురం రమేష్, జంగం సిద్ధయ్యా స్వామి, వట్టుపల్లి సిద్ధారెడ్డి, తాటిపల్లి వీరారెడ్డి, ఉప్పరి శివకుమార్, వట్టుపల్లి సందీప్ రెడ్డి, జామలపురం చింటూ, పూజారి సిద్దు, పిన్నోడి దత్తు, జంగం ఈశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.

మహిళల విభాగంలో శ్రీమతి జంగం సుమలత ఆధ్వర్యంలో జంగం లక్ష్మి, స్వరూప, లక్ష్మీబాయి, వట్టుపల్లి హన్మమ్మ, కమ్మరి సంగమ్మ, పుట్టి నాగలక్ష్మి, ఆకుల ఈశ్వరమ్మ, జామలపురం శ్రీలత, భోగం మంజుల, భోగం జనాభాయి, ఉప్పరి సుజాత, నల్లోళ్ల పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు. పల్లి గ్రామ ప్రజలు మరియు బొజిరెడ్డి పాండురంగ రెడ్డి వద్ద సంగమేశ్వర్ గ్రామ పెద్దలు తదితరులు గ్రామ తరపున వీడ్కోలు తెలిపినారు

# రైతులను నష్టాల్లోకి నెట్టిన తెల్ల బంగారం

**ఎకరాకు 25 వేల రూపాయల వరకు ఖర్చు**

**దిగుబడి రాక దిగాలు పడ్డ పత్తి రైతులు**

**అనావృష్టి కారణంగానే బరువెక్కిన రైతు గుండె ప్రభుత్వమే ఆదుకోవాలి**



జహీరాబాద్,మ అక్టోబరు 22 మనం న్యూస్: వర్షాలు సక్రమంగా పడకపోవడంతో పత్తి (తెల్ల బంగారం) రైతులను నిండ ముంచింది. జహీరాబాద్ నియోజకవర్గం లోని న్యాల్ కల్, ఝరాసంగం , కోహిర్ , జహీరాబాద్ ,మొగుడంపల్లి మండలాల్లో వేల ఎకరాల్లో పత్తి పంటను వేసినప్పటికీ ఎల్ లినో ప్రభావంతో వర్షాలు పడకపోవడంతో పత్తి రైతులు దిగుబడి రాక లబోదిబోమంటున్నారు. కొన్ని గ్రామాలలో పత్తి పంట సాగు చేసే రైతులు బోరుబావుల ద్వారా నీరు అందించాలని సంకల్పించినప్పటికీ కరెంటు లోగోలు టీజీ రావడంతో మోటర్ కాలిపోయి ట్రాన్స్ఫార్మర్లు పేలిపోవడంతో నీరు అందించలేకపోతున్నారు. పత్తి సాగుకు ప్రతి ఎకరానికి 25 వేల రూపాయల ఖర్చు అవుతుందని ఆ ఖర్చు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు గుండెలు బాదుకుంటున్నారు. ప్రతి సంవత్సరం లాగా ఈ సంవత్సరం కూడా అత్యధికంగా నేలకల్ మండలంలో పత్తి సాగు చేయగా అత్యల్పంగా మొగుడంపల్లి మండలంలో పత్తి సాగు చేశారు. వర్షాలు పడకపోవడంతో పత్తి ఎదుగుదల రాకపోవడంతో పొలంలో వేసిన ఎరువులు శ్రమ వృధా అయిందని రైతులు ఆపోతున్నారు. ప్రతి సంవత్సరము ఒక్కొక్క పత్తి మొక్కకి 150 నుండి 180 వరకు పత్తి కాయలు వచ్చేవని ఈ సంవత్సరము ప్రతి మొక్కకి 8 నుండి 15 కాయలు వచ్చాయని దీంతో పెట్టిన పెట్టుబడి రాక అప్పుల పాలు కావలసి వస్తుంది రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల పరిస్థితిని పసిగట్టిన పత్తి విత్తనాలు, ఎరువులు వ్యాపారులు అధిక ధరలకు విక్రయించారు. విక్రయదారులు ప్రతి సంవత్సరం పత్తి అమ్మిన తర్వాత డబ్బులను వడ్డీతో సహా వసూలు చేస్తుంటారు ఈ సంవత్సరం పత్తి దిగుబడి రాకపోవడంతో రైతులు తాము చేసిన అప్పులను ఎలా తీర్చాలోనని దిగులు చెందుతున్నారు. న్యాల్ కల్ మండలంలో 28368 రా సంఘం23196, కోహిర్ 4597, జహీరాబాద్,1300 మొగుడంపల్లి 339 ఎకరాల్లో పత్తి పంటను వేశారు. వేసిన పంట చేతికి రాకపోవడంతో అప్పులు తీర్చే పరిస్థితుల్లో లేకపోవడం ఏదో తమకు ఉన్న భూమిలో కొంత భాగాన్ని అమ్మి అప్పులు తీర్చేందుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు, పత్తి పెట్టీన రైతులకు ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. కొందరు రైతులు భూములను కౌలుకు తీసుకొని పత్తిపాటి సాగు చేసినప్పటికీ నష్టాల బాట పట్టవలసి వచ్చింది. ప్రత్యేకరానికి పట్టేదారుకు 20 నుంచి 30 వేల వరకు కౌలు ఇచ్చి సాగు చేయడంతో పాటు ప్రతి ఎకరాకు 25 వేల పెట్టుబడి పెట్టడం వల్ల కౌలు రైతులు కూడా నిండా మునిగారు. ఈ సంవత్సరము పత్తి పండించిన రైతులు మాత్రం అప్పుల ఊబిలో కూరుకుపోయి గుండె బరువెక్కిందని చెప్పవచ్చు. దీనికి ప్రభుత్వ అధికారులు ప్రజా ప్రతినిధులు పచ్చ రైతులను ఆదుకొని నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

# సిద్ధారెడ్డి జన్మదినం సందర్భంగా రక్తదానం



**- మానవత్వం చాటిన యూత్ కాంగ్రెస్**

**మనూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం**

**- రక్తదానమే మహాదానమని చాటిన యువత**

మనూర్, అక్టోబర్ 22(మనం న్యూస్): నారాయణఖేడ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గంపలి సిద్ధారెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ శ్రేణులు సేవా కార్యక్రమాలతో ఘనంగా జరుపుకున్నారు. జన్మదినాన్ని పురస్కరించుకుని మనూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో భారీ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.



**రక్తదానమే మహాదానం:**

రక్తదానం చేయడం వల్ల ఒక నిండు ప్రాణాన్ని కాపాడవచ్చని, యువత రక్తదానానికి ముందుకు రావాలనే సదుద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రక్త నిల్వాలు తక్కువగా ఉండటంతో, అత్యవసర సమయంలో రోగులకు ఉపయోగపడేలా ఈ కార్యక్రమం చేపట్టారు.

ఉదయం నుండే యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. పుల్కుర్తి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆర్. నర్సింలు, యువ నాయకులు శిరోమణి శ్రీకాంత్, నర్సింలు, వినయ్ కుమార్, రాజు తదితరులు మొదటగా రక్తదానం చేసి యువతకు ఆదర్శంగా నిలిచారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బెల్లాపూర్ మాజీ సర్పంచ్ కాజా దిగంబర్ రెడ్డి, దోసపల్లి సర్పంచ్ బిరుదారు దత్తు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ గంపలి సిద్ధారెడ్డి నాయకత్వంలో యూత్ కాంగ్రెస్ సేవా కార్యక్రమాల్లో ముందుంటుందని, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలని సూచించారు.

వివిధ గ్రామాల నుండి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికి, సహకరించిన వైద్య సిబ్బందికి, ఆసుపత్రి సిబ్బందికి నిర్వాహకులు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

అనంతరం గంపలి సిద్ధారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతూ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.




# అంగన్ వాడి కేంద్రాలకు న్యూ ల్యాండ్ పరిశ్రమ చేయూత

**ఆట వస్తువులు పంపిణీ చేసిన న్యూజిలాండ్ పరిశ్రమ.**

గుమ్మడిదల ( మనం న్యూస్) అక్టోబర్ 22 : గుమ్మడిదల మండలం, గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో 13 గ్రామాలలో 29 అంగన్వాడీ కేంద్రాలకు న్యూ ల్యాండ్ పరిశ్రమ గురువారం నాడు ఆట వస్తువులు పంపిణీ చేసింది. ఈ సందర్భంగా గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలకు పరిశ్రమ ఆట వస్తువులు పంపిణీ చేసి ఉదార స్వభావాన్ని చాటుకోవడం సంతోషించదగ్గ విషయమని మిగతా పరిశ్రమల యాజమాన్యాలు కూడా ఇదేవిధంగా ముందుకు వచ్చి గ్రామాలను అభివృద్ధి చేస్తే ఎంతో మేలు జరుగుతుందని ఆయన ఆశా భావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు, వార్డు కౌన్సిలర్లు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.